

9న మెగా జాబ్‌మేళా

నరసన్నపేట : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల తొమ్మిదో తేదీన ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో సుమారు 12 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 615 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగులు అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 99499 00672, 94932 90012 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఉద్యాన పంటలకు ఊతం

- విస్తరణకు ప్రోత్సాహకాల పెంపు
- 2025-26లో 14,195 ఎకరాలకు సాయం
- రూ.2.62 కోట్ల బడ్జెట్ కేటాయింపు

ఉద్యాన పంటల సాగుపై ప్రభుత్వం దృష్టిసారించింది. విస్తరణ కోసం ఇప్పటివరకు అమలు చేస్తున్న పథకాలను ప్రభుత్వం ఇటీవల సమీక్షించింది. అందులో కొన్ని పథకాల ద్వారా అందిస్తున్న సాయాన్ని మరింత పెంచాలని నిర్ణయించింది. రైతులను ఆకర్షించేలా ప్రోత్సాహాలను అందించేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాయితీని అందించాలని నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మేర ఆర్థికసాయం ఇవ్వనున్నాయి. ఇప్పటికే కొన్నిరకాల పంటలను ఎంపిక చేసి వాటికి అందించనున్న ప్రోత్సాహక రాయితీలను ప్రకటించాయి.



పూల సాగు చేస్తున్న రైతులు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుతం 1,10,625 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వీటి ద్వారా 1,55,147 మెట్రిక్ టన్నుల మేర పలురకాల పంట ఉత్పత్తి వస్తోంది. జిల్లాలోని సుదీర్ఘ సముద్రతీరం, పలురకాల వైవిధ్య పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో విస్తరణ పథకాలను మరింత పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 14,195 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు విస్తరణ చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకుగానూ రూ.2.62 కోట్ల బడ్జెట్ కేటాయించింది. నర్సరీల నుంచి నాణ్యమైన మొక్కలను సేకరించడం, సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. రైతులు ఏ రకం ఉద్యాన పంటలు ఎంపిక చేసుకోవాలనుకుంటున్నారో, తొలకరి వర్షాలకు ముందే గుర్తించనున్నారు. ఈ పథకంలో డ్రాగన్ ఫ్రూట్‌కు ఇప్పటివరకు అందిస్తున్న రాయితీని భారీగా పెంచింది. గతంలో ఎకరాకు రూ.12 వేలు సబ్సిడీ అందించగా, ఇకపై రూ.1,62,000 అందించనున్నారు.

పలురకాల పథకాల సాగు విస్తరణ లక్ష్యం ఇలా...

జిల్లాలో ఈ ఏడాది 14,195 ఎకరాల్లో ఉద్యాన పంటలకు సాగు విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా 995 ఎకరాలకు సాయం అందించనున్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా 150 ఎకరాల్లో సాగు విస్తరణ చేపట్టనున్నారు. అదేవిధంగా కేంద్ర ఆయిల్‌పామ్ మిషన్ ద్వారా రెండు వేల ఎకరాల్లో పథకాన్ని అమలు చేయనున్నారు. జాతీయ వెదురు మిషన్ ద్వారా 25 ఎకరాలకు సబ్సిడీ అందించనున్నారు. సాగుకు యోగ్యమయ్యే బీడు భూములు 8,875 ఎకరాలను గుర్తించి, పంటల సాగు చేసే రైతులకు సాయం అందించనున్నారు. పంట వైవిధ్యీకరణ ద్వారా 150 ఎకరాలకు సాగు విస్తరణ అమలు చేయనున్నారు. ఉపాధి హామీలో తోటల విస్తరణ కింద 3,150 ఎకరాలకు, కొబ్బరి విస్తరణలో భాగంగా 750 ఎకరాలకు సాగు విస్తరణ పథకాలను వర్తింపజేసి రైతులకు రాయితీ అందించనున్నారు.

పంటలకు పెరిగిన రాయితీ వివరాలు

పంట	గతేడాది రాయితీ (రూ.ల్లో)	ప్రస్తుత రాయితీ (రూ.ల్లో)
డ్రాగన్ ఫ్రూట్	30, 000	1,62,000
మామిడి	7,980	30,000
జీడి మామిడి	12,000	18,000
జామ	17,599	48,000
కోకో	12,000	18,000
అరటి	30,000	42,000
నిమ్మ	9,602	30,000
బంతి, చేమంతి		
కనకాంబరం	16,000	20,000
సంకరజాతి		
కూరగాయలు	20,000	24,000
బొప్పాయి	18,000	18,000
పైనాపిల్	26,000	26,000

పథకానికి దరఖాస్తు ఇలా...

ఉద్యాన పంటలు సాగు విస్తరణ పథకాలు పొందాలంటే రైతులు ఐదెకరాల్లోపు భూమి కలిగి ఉండాలి. రైతులు సమీప రైతు సేవా కేంద్రాలు గానీ ఉద్యాన శాఖ గానీ వ్యవసాయశాఖ సహాయకులను సంప్రదించాలి. వారిచ్చే సూచనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలి. దరఖాస్తులతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, రైతు ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ జిరాక్స్ ప్రతులతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోను జత చేయాలి. తర్వాత ఉద్యానశాఖ, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతారు. అర్హులైన రైతులకు నేరుగా ప్రభుత్వం వారి ఖాతాల్లో రాయితీని జమ చేయనుంది.

రైతుల ఆదాయం పెరుగుదలకు దోహదం



ఉద్యాన పంటల విస్తరణలో భాగంగా పలురకాల పథకాలకు ప్రభుత్వం భారీగా రాయితీ పెంచింది. విస్తరణలో భాగంగా వైవిధ్యమైన పంటల సాగుతో పాటు ఆదాయం పెంచుకోవచ్చు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి



కళా ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఉద్దానంలో విధ్వంసం వద్దు

కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో కళాజాతా

ప్రజాశక్తి - మందస

పచ్చని ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు పేరిట పర్యావరణ విధ్వంసం వద్దని సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, తాండ్ర ప్రకాష్ అన్నారు. బలవంతపు భూసేకరణ చేస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం గంగువాడలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన కళా జాతాను మంగళవారం ప్రారంభించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు కె.హేమసూదన్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎస్‌రామారావు, ప్రజా కళా మండలి జిల్లా అధ్యక్షులు రాపాక చిరంజీవి నేతృత్వాన కళాకారులు కళా రూపాలను ప్రదర్శించి పోర్టు ప్రభావిత గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల నుంచి ఈ ప్రాంతాన్ని కాపాడడంలో జీడి, కొబ్బరి, పనస, మునగ వంటి చెట్లు రక్షణ గోడలా ఉన్నాయన్నారు. తీర ప్రాంతంలో ఉన్న లక్షలాది చెట్లు నరకడం పర్యావరణ విధ్వంసం కాదా అని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు బదలాయించడం అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు కేవలం సరుకుల రవాణా కోసం మాత్రమే అని అన్నారు. అందువల్ల మూలపేట పోర్టుకు కేటాయించిన 2,279 ఎకరాల్లో 300 ఎకరాలు కార్గో ఎయిర్‌పోర్టుకి కేటాయిస్తే, జిల్లాలో భూసేకరణ అవసరం లేదని సూచించారు. ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు బదలాయింపు చేస్తే జిల్లా అభివృద్ధి కాదని, జిల్లాలో వంశధార రిజర్వాయర్ పూర్తి చేసి చివర భూముల వరకు రెండు పంటలకు నీరు ఇస్తే జిల్లా ప్రజలకు రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తద్వారా కొనుగోలు శక్తి పెరిగి అనుబంధ పరిశ్రమలు వస్తాయని, వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా, సాగునీరు అందించకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దశల వారీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కళా జాతాలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.గణపతి, జీడి రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఆహార భద్రత నియమాలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆహార భద్రత నియమాలు పాటించని వ్యాపారులపై విచారణ చేసి రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఆహార పదార్థాల తయారీ, అమ్మకాలు చేసే వారు అక్రమాలకు పాల్పడిన వారిపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం-06లోని నియమ, నిబంధనల ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు విమర్శించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాల్టీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన, అకాల మరణం పొందిన, అనారోగ్యం పాలైన పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ వర్కర్స్ స్థానంలో సామాజిక భద్రతలో భాగంగా వారి పిల్లలకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలం పాటు నగర ప్రజలకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారికి జీవన భృతి కోసం గ్రాట్యుటీ చెల్లించి ఆదుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించపోతే భవిష్యత్‌లో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 20న నిర్వహించే అఖిల భారత సమ్మెలో మున్సిపల్ కార్మికులు భాగస్వామ్యమవుతున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎ.గణేష్, కె.రాజు, డి.యుగంధర్, ఎ.శేఖర్, డి.గంగ, ఎన్.జె లక్ష్మి, కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మస్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎ.రమేష్ కుమార్ పట్నాయక్, మంగళ్ సత్తు, గంగాధర్ రౌతో, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు

ఖరీఫ్ నాటికి కాలువలు సిద్ధం

శ్రీకాకుళం : ఖరీఫ్ నాటికి రైతులకు సాగునీటి ఇబ్బందుల్లేకుండా కాలువలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మేజర్, మైనర్ ఇరిగేషన్ పనులకు సంబంధించి అధికారులతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని రెగ్యులర్, ఆర్ఎంసి, బైరిదేశి గెడ్డకు సంబంధించిన పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఇప్పట్నుంచే చిన్న కాలువలను ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టాలన్నారు. చెక్‌డ్యామ్‌లు, ఇతర నీటిపారుదల శాఖకు సంబంధించిన పనులను ఉపాధి నిధులతో చేపట్టి పూర్తి చేయాలన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి

- సకాలంలో సాగునీరు, విత్తనాల సరఫరా
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖరీఫ్ సన్నద్ధతపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరా, విత్తనాల పంపిణీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండరాదన్నారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల పరిశుభ్రత, సచివాలయ ఉద్యోగుల పనితీరు, మత్స్య పశుసంవర్ధక శాఖల పనితీరు, రహదారుల నిర్మాణం, భూవివాదాల పరిష్కారం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఆసుపత్రులలో ఔషధాల లభ్యత తదితర అంశాలపై చర్చించారు. పారిశుధ్య పనులను ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు ప్రారంభించాలని ఆదేశించారు.

మత్స్యశాఖ చేపల పెంపకంపై, పశు సంవర్ధకశాఖ పశువుల వ్యాక్సినేషన్ కార్డుల పంపిణీపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. విద్య, వైద్యారోగ్య శాఖల పనితీరును పరిశీలించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆస్పత్రుల్లో మందుల లభ్యత, వైద్యుల హాజరు వంటి విషయాలపై మండల స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ వనరుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, పనులు ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి, పలు శాఖల అధికారులు, ఆయా మండలాల నుంచి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఆశా'ల సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న సమ్మెలో భాగస్వామ్యమవుతున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు అమరావతి తెలిపారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ అనితకు యూనియన్ ప్రతినిధులతో కలిసి మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లుగా 20 ఏళ్లుగా పనిచేస్తున్నా, ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. దీర్ఘకాలంగా అనేక సమస్యల పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కనీసం ప్రభుత్వ సెలవులు కూడా ఇవ్వకుండా పనిభారాన్ని పెంచారన్నారు. ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఒప్పంద జిఒలను విడుదల చేసి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశావర్కర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని, ఆశావర్కర్లందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు.

కొత్తూరు : కురిగాం పిహెచ్‌సి వైద్యులు పెద్దిన ప్రసన్న కుమార్‌కు ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.గౌరమ్మ, కె.జ్యోత్స్న, పి.జయలక్ష్మి, జగదాంబ, లక్ష్మి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టెక్కలి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేదుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో గల క్యాంపు కార్యాలయంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అమలు, పనితీరుపై నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగిగేషన్ పరిస్థితి, వాటి పనితీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 14 ఉన్నాయని తెలిపిన అధికారులు, వీటన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆధునీకరణ పనులు చేపట్టేందుకు ఎంత నిధులు అవసరమో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. శ్రీపురం, కురుడు, పొడుగుపాడు, నారాయణవలస, కొత్తపేట, నారాయణపురం, చిన్నసాన, నిమ్మాడ, పోలవరం, సుభంద్రాపురం, మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకానికి రూ.12 కోట్ల వరకు నిధులు అవసరం ఉంటుందని మంత్రికి అధికారులు వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, నిధులు మంజూరు చేసే బాధ్యత తనదని తెలిపారు. తొలి ప్రాధాన్యతా క్రమంలో మదనగోసాగరం పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించగా, వాటికి రూ.4.80 లక్షలు అవసరం ఉంటుందని అధికారులు మంత్రికి వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఇఇ కె.వి సుబ్రమణ్యం, డిఇ కామరాజు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బారు నిర్వహించి వినతులు స్వీకరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నూతన ఫించన్లు, ఇళ్లు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు వచ్చాయి.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

- అసభ్యకర, అనైతిక పోస్టులు పెడితే చర్యలు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సామాజిక మాధ్యమాల వేదికగా ఇతరులను కించపరిచేలా అసభ్యకరమైన, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన సోషల్ మీడియా కేసుల్లో పలువురు నిందితులను గుర్తించి అరెస్టు చేశామన్నారు. సోషల్ మీడియా, సైబర్ కేసుల నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టు, ఆర్థిక సైబర్ నేరాల్లో పోగొట్టుకున్న నగదు ఫ్రీజ్ తదితర అంశాలపై అదనపు ఎస్‌పి కె.వి రమణతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సైబర్ నేరాల దర్యాప్తులో చేపట్టాల్సిన మెలకువలు, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై నిఘా, అరెస్టు, తీసుకోవాల్సిన చర్యలు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే పద్ధతిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికలో తప్పుడు, అసత్య ప్రచారాలు చేసిన వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం సైబర్ సెల్, సోషల్ మీడియా పోలీసు బృందాలు నిరంతరం ప్రత్యేకంగా నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులపై, సంస్థలపై గానీ హేయమైన, అసత్య ప్రచారాలు, ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్, ట్రోలింగు చేసినా, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, కించపరిచే వ్యాఖ్యలు చేసినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేయాలన్నారు. తదుపరి ఎటువంటి అలసత్వం లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ కేసులను ఛేదించడంలో ప్రతి అంశాన్నీ కీలకంగా తీసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధిత వ్యక్తులు పోగొట్టుకున్న నగదును గోల్డెన్ అవర్‌లో ఫ్రీజ్ చేయించి, కేసు దర్యాప్తు అనంతరం చట్టప్రకారం కోర్టు ద్వారా ఫ్రీజింగ్ నగదును బాధితులకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం లభిస్తున్న టూల్స్, బేసిక్ నాలెడ్జ్‌తో పాటు హ్యూమన్ ఇంటెలిజెన్స్‌తో కేసులు చాకచక్యంగా, సులభంగా ఛేదించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సిఎం సహాయనిధి పేదలకు వరం

కోటబొమ్మాళి: వివిధ అనారోగ్యాల కారణంగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు ఆర్థిక సహాయం అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సిఎం సహాయనిధి కింద లబ్ధిదారులకు రూ.7,71,067 లక్షల చెక్కులను తొమ్మిది మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ఒక్కరూ వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని ఆశయంతో తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆపద సమయంలో ఆశ్రయించగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు.


లక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

శ్రీకాకుళం: జిల్లా హోంగార్డు యూనిట్‌కు చెందిన హోంగార్డు సింగూరు రాజేశ్వరరావు ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా అందించిన ఒకరోజు వేతనాన్ని ఆర్థికసాయంగా మొత్తం రూ.4 లక్షల 4 వేలు నగదు చెక్కును ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాజేశ్వరరావు సతీమణి సింగూరు లక్ష్మికి అందించారు. హోంగార్డులు విధి నిర్వహణలో మృతి చెందినా లేదా పదవీ విరమణ పొందినా వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులంతా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందిస్తున్నారు. సహచర ఉద్యోగికి సహాయం చేస్తూ హోంగార్డులు ఐక్యత భావాన్ని చాటారని ఎస్‌పి కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, ఎఒసిహెచ్ గోపినాథ్, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.


కొబ్బరి రైతుల సమస్యలు వివరిస్తున్న కిరణ్ కుమార్

ఉద్దానం రైతులకు అండగా నిలవాలి

కవిటి: చీడపీడలతో సతమతమవుతున్న ఉద్దానం రైతులకు అండగా నిలవాలని పిసిసి అధ్యక్షురాలు షర్మిలను కవిటి మండల వాసి, శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు విశాఖపట్నం ఎయిర్ పోర్టులో మంగళవారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో తెల్లదోమ కొబ్బరిని పీల్చి పిప్పి చేస్తోందని, దీని నివారణకు డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అదే సమయంలో కొబ్బరి బీమా పథకంలో ఉద్దానం రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన షర్మిల ఉద్దానం రైతులకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరమ్మ

తూతూమంత్రంగా మండల సమావేశం

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశం ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సభ్యులు హాజరైనప్పటికీ ఎవరూ సమస్యలు ప్రస్తావించలేదు. మండలంలోని పలు గ్రామాల్లో నీటి కొరత ఉందని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పెద్ద పద్మాపురం లిఫ్ట్ ద్వారా మెళియాపుట్టి చింతల గాడింగల చెరువుకు నీరు అందించి గ్రామ రైతులకు సాగునీరు అందివ్వాలని ఎంపిటిసి ప్రతినిధి జైమునిరావు అన్నారు. వసుంధర ఎంపిటిసి సలాన చిట్టి మాట్లాడుతూ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని, పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. వివిధ పద్దులపైన సమీక్షించారు. దీంతో సమావేశం నామమాత్రంగా సాగింది. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, పాడి అప్పారావు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పలాస: మండలం గురుదాసుపురానికి చెందిన బురగాపు సూర్యం బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం ముందుకు వచ్చి రూ. 68 వేలు ఆర్థికసాయం అందజేశారు. తాము అండగా ఉంటామని, ఎప్పుడూ ఏ అవసరం వచ్చినా సంఘం నాయకుల దృష్టికి తీసుకువస్తే సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు సింహాద్రి, ధనుంజయ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ షణ్ముఖరావు ఆచారి, కృష్ణారావు, లక్ష్మణరావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తరలిపోతున్న టేకు సంపద

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో టేకు మాఫియా తెగ రెచ్చిపోతున్నారు. చెరువుగట్లైనా, అడవిలోనైనా, జిరాయితీ భూముల్లోనైనా టేకు చెట్లపై కన్నుపడితే వదిలేది లేదని అంటున్నారు. మండలంలో గిరిజన గ్రామాలతో పాటు జిరాయితీ భూముల్లో టేకు చెట్లు తరచూ మాయమవుతున్నాయి. గతంలో ఇదే విషయంపై ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకున్నప్పటికీ మరలా చెట్లను నరికి వేయడం ప్రారంభించారు. అడ్డూ అదుపు లేకుండా జిరాయితీ భూముల్లో ఉన్న చెట్లను నరికేస్తూ పగలు, రాత్రి భయం లేకుండా తరలించుకుపోతున్నారు. గత నాలుగు రోజులుగా పలు జిరాయితీ భూముల్లో కొంతమంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా టేకు చెట్లను నరికి కుప్పలుగా వేసి ఉన్నారని తెలుస్తుంది. ఇది గమనించిన ఆయా గ్రామాలకు చెందిన వ్యక్తులు మండల తహశీల్దార్, ఇతర శాఖల అధికారులకు సమాచారం అందజేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించు కోవడంలేదని, తూతూ మంత్రంగా పరిశీలన జరిపి వెళ్ళిపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.


చెట్టును నరికివేయడంతో మిగిలిన చెట్టు మొదలు

చోద్యం చూస్తున్న అధికారులు

జిరాయితీ భూముల్లో టేకు చెట్లు మాయం అవుతున్నప్పటికీ పట్టించుకోవాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాగైతే కొద్ది రోజులకు మొత్తం చెట్లన్ని మాయమయ్యే పరిస్థితి తలెత్తుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, అటవీశాఖ అధికారులు స్పందించి అక్రమ చెట్ల నరికివేతను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు 'ప్రజాశక్తి,' ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించకపోవడం విశేషం. అలాగే స్థానిక ఎస్ఐ ప్రవల్లికను వివరణ కోరగా తనకు సమాచారం వచ్చిందని, ఈ విషయంపై పరిశీలన జరపడం జరిగిందన్నారు. అయితే పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి చర్యలు చేపడతామని తెలిపారు.


గోపీదేవిపేట సమీపంలో కొండల వద్ద అక్రమంగా నరికిన టేకు దుంగలు

గ్రామదేవత పండగలో ధర్మాన సోదరులు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మండలం మాకివలసలో జరుగుతున్న శ్రీ ఆసిరితల్లి గ్రామదేవత పండగల సందర్భంగా అమ్మవారిని మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎంపిపిలు వాన గోపి, ముద్దాడ బైరాగి నాయుడు, అంబటి శ్రీనివాస్, సర్పంచ్ రావాడ మోహన్, ఎంపిటిసి యాళ్ళ అప్పల నాయుడు, సురంగి నర్సింగరావు, కనపల శేఖరరావు, మాజీ డైరెక్టర్ ఐబెస్టి ఈశ్వరరావు, మండల యూత్ ఉపాధ్యక్షులు తోట భార్గవ్, పల్ల తాతారావు, కనపల అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన నీలమ్మతల్లి సంబరాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని దేవునల్తాడలో మూడు రోజులుగా జరిగిన నీలమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు పగటి వేషాలు, కర్రసాము, బిందెల నృత్యం, వివిధ జానపద, హాస్య ఫుట్బాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మాజీమంత్రి, వైసిపి డాక్టర్ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగ్రామం కావడంతో ఆయన కర్రసాము కళాకారులతో చేసిన నృత్యం అలరించింది. కార్యక్రమంలో ఎంపిటిసి సౌదాల వెంకన్న, మాజీ సర్పంచ్ సీదిరి చిరంజీవి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


తాడివలస పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఎఎన్ఎంలు, సిబ్బంది

వైద్య సిబ్బంది నిరసన

పొందూరు: మండలంలోని కింతలి, తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో మంగళవారం ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యసేవలను అందిస్తున్న తమపై ఎంఎల్‌హెచ్‌పిలు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అకారణంగా తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌హెచ్‌పిలు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎపిఒపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి- నౌపడ

విధుల్లో అలసత్వం వహించడంపై ఉపాధిహామీ ఎపిఒ పంగ నర్సింహమూర్తిపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లాలో ఫారం పాండ్స్ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ సిబ్బందితో గూగుల్‌మేట్‌లో సమావేశం నిర్వహించారు. మండలంలోని పొలాల్లో నీటినిల్వలు ఉంచేందుకు 420 ఫారంపాండ్లు నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే పలుసార్లు సమీక్షలు నిర్వహించినా ఉపాధి ఫారం పాండ్స్ నిర్మాణాలపై మండల సిబ్బంది అలసత్వం వహించారు. ఇప్పటి వరకు కేవలం మండలంలో 16 ఫారంపాండ్‌లు మాత్రమే నిర్మాణాలు జరిగాయి. ఈ మేరకు సమీక్ష జరిపిన కలెక్టర్ ఎపిఒ నర్సింహమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. దీనిపై డ్వామా పిడి సుధాకర్‌ను వివరణ కోరగా మండలంలో ఫారం ఫాండ్స్ నిర్మాణాల్లో చాలా వెనకబడి ఉన్నారని, పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ ఎపిఒపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు.

కంప్యూటర్‌పై శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి

మారుతున్న కాలంతో పాటు కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ఉచిత శిక్షణ కోర్సు ఏర్పాటు చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలలపాటు ఈ శిక్షణ కోర్సు ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించే నిరుద్యోగ విద్యార్థులు ఈ కోర్సులో శిక్షణ పొందవచ్చునని తెలిపారు. అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేయనున్నామని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు

ఆమదాలవలస: పట్టణంలో మంచినీటిని సరఫరా చేస్తున్న కుళాయిలకు మోటర్లు బిగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురపాలక సంఘంలో వేసవికాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పట్టణంలో నీటిఎద్దడికి గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా వివిధ వార్డుల్లో ఇంటి యజమానులు ఇంటి కొళాయిలకు మోటార్లను బిగించి అక్రమంగా నీటిని నిల్వ చేయడం వలన మిగతా కుటుంబాలకు మంచినీటి కొరత ఏర్పడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో అక్రమ మోటార్ల నీటి కొరత సృష్టించినట్లయితే మున్సిపల్ చట్ట ప్రకారం మోటార్లు బిగించిన ఇంటిని గుర్తించిన వెంటనే సిబ్బందితో మోటార్లు తొలగించి కొళాయిలను డమ్మీ చేయించి వారిపై పురపాలక సంఘ చట్టం 1965 నీటి సరఫరా నియమావళి నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసు కోబడునని ప్రకటనలో తెలిపారు.


కూలీలతో మాట్లాడుతున్న కార్యదర్శి ఉమాపతి

సీనియర్ సిటిజన్ కార్డు చేయించుకోవాలి

ప్రజాశక్తి- నౌపడ

సీనియర్ సిటిజన్ కార్డు 60 ఏళ్ల దాటిన ప్రతిఒక్క పౌరుడు చేయించుకోవాలని నౌపడ కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి సూచించారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో మంగళవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో సమావేశమయ్యారు. సీనియర్ సిటిజన్ కార్డు వలన కలిగే ప్రయోజనాలను వేతనదారులకు వివరించారు. ఆధార్ కార్డు జిరాక్స్, ఫోటో, బ్లడ్ గ్రూప్, రిజిస్టర్ మొబైల్ నంబరుతో సచివాలయానికి వచ్చి అర్హులైన ప్రతి ఒక్కరూ కార్డుకు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉదయ్, ఉపాధి హామీ ఫీల్ అసిస్టెంట్ దేవా, కూలీలు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాలకు, మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు సరఫరా చేయనున్న ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రం నుంచి వచ్చినట్లు ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. ఒకటి నుంచి పది తరగతులకు సంబంధించి 22 వేల 439 పాఠ్యపుస్తకాలు, 32,262 నోట్ పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. ఈ పుస్తకాలు త్వరలోనే ఆయా పాఠశాలలకు సంబంధించి ఇండెంట్ ప్రకారం హెచ్‌ఎంలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎంఇఒతో పాటు సిఆర్‌పిలు, సిబ్బంది ఉన్నారు.


పాఠ్య పుస్తకాలను లెక్కిస్తున్న మురళీకృష్ణ, సిబ్బంది


కొత్తూరు : మాట్లాడుతున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి

బాలికలు బాగా చదువుకోవాలి

ప్రజాశక్తి- కొత్తూరు

బాలికలు బాగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి అన్నారు. కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక అంగన్వాడీ కేంద్రం 4, చిన్న సంకిలి అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాలికలతో మాట్లాడుతూ మంచి ఆహారం తీసు కోవాలని, బాల్య వివాహాలు చేసుకోరాదన్నారు. ఈమెతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా పీడీ కనకదుర్గ, సీతంపేట సిడిపిఒ రంగా లక్ష్మి, కొత్తూరు సిడిపిఒ యు.విమల కుమారి, సూపర్‌వైజర్లు ఎల్.శాంతి కుమారి, సుధావని, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.ధనలక్ష్మి, ఎస్. రమణమ్మ, ఉత్తరమ్మ ఉన్నారు.

కవిటి: కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యతని అంగన్వాడీ సూపర్‌వైజర్ పల్లవి అన్నారు. మండలం బల్లిపుట్టుగలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పల్లవి బాలికలకు పలు సూచనలు చేశారు. బాలికలు చిన్ననాటి నుంచే దృఢంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకుంటూ, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు చదువుతో పాటు చట్టాలపై అవగాహన చేసుకుని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శి శారద పాడి, సిహెచ్ భారతి, బి.శశి, ఎస్.లక్ష్మి, ఎం.తిలోత్తమ, డి.జ్ఞానావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారుల సహకారం అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. మంగళవారం డ్వామా, ఐసిడిఎస్ కార్యాలయాలను ఆయన సందర్శించి సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రధానంగా ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గోశాలలు, పశువుల నీటి తొట్టెలు నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్వామా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రధానంగా రోడ్లు, కాలువల పనులు ఇతర ప్రభుత్వ భవనాల పెండింగ్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో డ్వామా పీడీ సుధాకరరావు పాల్గొన్నారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ పోస్టుల భర్తీకి సహకరించాలన్నారు. అలాగే అంగన్వాడీ భవనాలపై చర్చించి నివేదిక కోరారు. నిర్మాణ దశలో 12 భవనాలు , గార పరిధిలో అసంపూర్తిగా 57 భవనాలు, శ్రీకాకుళం అర్బన్‌లో 176 భవనాల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పిఒ శాంతిశ్రీ, అర్బన్ సిడిపిఒ శోభారాణి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్


కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అంజన్నప్ప

కళలను ప్రోత్సహించాలి

ఆమదాలవలస: తెలుగు సాంప్రదాయ కళా రూపాలు అంతరించిపోతున్న తరుణంలో కళలకు జీవం పోయాలన్న ఉద్దేశంతో కళాకారులను ప్రోత్సహించి కళలను ఆదరించాలని తేనెతెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు అంజన్నప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు గృహంలో కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్నప్ప మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలు లాంటి కళాకారులను ప్రోత్సహిస్తూ ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక ప్రాంతాల్లో ఉన్న కళాకారులను ప్రపంచానికి పరిచయం చేయాలన్న సదుద్దేశంతో తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ కళాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ప్రశంసాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులు సామవేదం, బాల సుబ్రమణ్యం, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని కిష్టప్పపేట జెడ్‌పి హైస్కూల్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు బిపి, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. 40 ఏళ్లుదాటిన వారికి ఇసిజి టెస్టు చేపట్టారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ భార్గవ్, డా.చైతన్య, ఆస్పత్రి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టిఎస్ఎన్ మూర్తి, ఆస్పత్రి సిబ్బంది నీలవేణి, పావని, హైమావతి తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కుట్టుమిషన్ల పంపిణీలో అవకతవకలు

ప్రజాశక్తి- నరసన్నపేట

బిసి రుణాల పేరుతో కూటమి నాయకులు జేబులు నింపుకుంటున్నారని మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీలో భారీ అవకతవకలు జరిగాయని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వాన గోపి అన్నారు. మంగళవారం వైసిపి బిసి విభాగం అధ్యక్షులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం అవకతవకలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ సత్య నారాయణ, ఎంపిడిఒ మధుసూదనరావులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి ప్రతినిధులు, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు, నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీలో రూ.235 కోట్ల నిధులు గోల్‌మాల్ అయ్యాయని జిల్లా వైసిపి అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను పక్కన పెట్టి బిసిల పేరుతో కుట్టుమిషన్‌ల కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు. సిఎం చంద్రబాబు నాయుడు అనుభవం ఇటువంటి స్కామ్‌లకు పనికొచ్చిందని ఎద్దేవా చేశారు. 50 ఏళ్లుదాటిన మహిళలకు భర్త చనిపోతే వెంటనే పింఛను మంజూరు చేస్తున్నారని, 50 ఏళ్లలోపు మహిళల భర్తలు చనిపోతే పింఛను మంజూరు చేయడం లేదని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఉపాధిహామీ కాంపౌండ్ నిధులు దుర్వినియోగం చేసి పంచాయతీ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోట వెంకట రామారావు, కోట జస్వంత్, కూర్మారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట : అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- కొత్తూరు

హిరమండల మండలం శుభల యి గ్రామానికి చెందిన పిన్నింటి నగేష్ (22) అనే యువకుడు మండల కేంద్రంలోని బిసి హాస్టల్ సమీపంలో ఉన్న పొలాల్లో వున్న టేకుచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చూసి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిఐ చింతాడ ప్రసాదరావు సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన విషయాన్ని స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని యువకుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మండల కేంద్రానికి చేరుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందించారు. తండ్రి జానకిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారుడు చెడు వ్యసనాలకు బానిసై ఉండటంతో ఇంటి వద్ద కుటుంబసభ్యులు మందలించడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మృతిచెందిన నగేష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారి జర్జంగి గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... నరసన్నపేట నుంచి టెక్కలి వెళ్తున్న జాతీయ రహదారిలో చిప్స్‌లోడుతో వస్తున్న ట్రాక్టర్ శ్రీ జగన్నాధపురం వెళ్లేందుకు జర్జంగి గ్రామ సమీపంలో జంక్షన్ వద్ద ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా యుటర్న్ తీసుకోవడంతో అదే రహదారిలో ద్విచక్రవాహనంపై వస్తున్న జలుమూరు మండలం బాచివలసకు చెందిన బొద్దల సింహాచలం (35), కుమారుడు జగన్మోహనరావులను బలంగా ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సహాయంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందగా, కుమారుడు జగన్మోహనరావు చికిత్స పొందుతున్నాడు. స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు సింహాచలం

నాలుగు ఇళ్లలో చోరీ

పలాస: మండలం వీరభద్రాపురంలో మంగళవారం తెల్లివారుజామున నాలుగు ఇళ్లల్లో ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడి ఆరు తులాల బంగారం, 10 తులాల వెండి అపహరించారు. బాధితుల కథనం మేరకు వీరభద్రాపురంలో తలగాపు మల్లేసు, కాయల ఢిల్లీరావు, పైల కేశవరావు, తలగాపు రామారావు ఇళ్లలో ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ముందుగా పైల కేశవరావు, తలగాపు మల్లేసు ఇంట్లో దొంగలు చోరీకి యత్నించగా ఏమి దొరకకపోవడంతో అదే సమయంలో ఢిల్లీశ్వరరావు ఇంటిలో పది తులాల వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్ చోరీ చేశారు. అనంతరం తలగాపు రామారావు భార్య ఇంటిలో నిద్రిస్తుండగా ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడుతో పాటు, బంగారపు చైనును దొంగిలించి పరారవుతున్న సమయంలో ఆమెకు మెళుకువ వచ్చి కేకలు వేయగా ఆమె కుమారుడు జోగారావు దొంగలను వెంబడించినప్పటికీ చేతికి చిక్కలేదు. ఇరువురు దొంగలు రెండు వైపుల పరుగులు తీయడంతో ఏమి చేయలేక వెనుతిరిగారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా, శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం, స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

అప్పలనాయుడుకు పితృ వియోగం

లావేరు: మండలంలోని పెద్దలింగాలవలసకు చెందిన బిజెపి మండల అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు తండ్రి పెదలింగాలవలస సర్పంచ్ లుకలాపు యశోద మామ లుకలాపు లక్ష్మణరావు సోమవారం రాత్రి పెదలింగాలవలసలో తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. మంగళవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు భౌతికఖాయం వద్ద నివాళ్ళర్పించారు. అంతమ యాత్రలో లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, టొంపల సీతారాం, సనపల నారాయణరావు, మురళీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

శ్రీరాములు స్థూపం.. ఆశయాల ప్రతిరూపం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బమ్మిడి శ్రీరాములు భౌతికంగా లేకపోయినా, ఆయన స్థూపంలో ఆయన ఆశయం కనిపిస్తుందని ప్రముఖ వైద్యులు తెప్పల ఆనంద్ అన్నారు. మంగళవారం శ్రీరాములు కుటుంబసభ్యులచే నిర్మించిన స్థూపాన్ని పూండీ గల్లీలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం బమ్మిడి అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ శ్రీరాములు ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాలే తన ప్రయోజనాలుగా భావించి పనిచేసేవారన్నారు. శ్రీరాములు ఆర్థిక క్రమశిక్షణ, పార్టీ క్రమశిక్షణకు నూటికి నూరు శాతం కట్టుబడి ఉన్న వ్యక్తిని ఆయన కొనియాడారు. పార్టీ కోసం, ప్రజా సంఘాల నిర్మాణం కోసం ఆయన ఊపిరి ఆగినంత వరకు పరితపించారన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఆర్.సురేష్ బాబు మాట్లాడుతూ శ్రీరాములు పార్టీ ఇచ్చిన నిర్ణయానికి ఎంత కటువుగా ఉన్న, ఆచరించి తనపని తాను చేసుకుంటూ ముందుకు వెళ్లే వ్యక్తిని గుర్తు చేశారు. గిరిజన రైతుల్లో ఉంటూ అక్కడే పడుకుని వాళు పెట్టిందే తిని వాళ్ళ సమస్యలు తెలుసుకుని పోరాటంలో అగ్ర భాగాన ఉండేవారన్నారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వంటి వ్యక్తులతో కమిటీల్లో ఉండి పని చేశారన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రయ్య, వైకుంఠరావు శ్రీరాములు ఆశయంపై గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో శ్రీరాములు కుటుంబసభ్యులు తులసీ నారాయణ, టి.నారాయణరావు, హనుమంతు ఈశ్వరరావు, టి. ధర్మారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు ఆనంద్

రైతు సంక్షోభాల నుంచి బయట పడాలంటే, ఐక్య పోరాటాలే శరణ్యమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. నగరంపల్లిలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన బమ్మిడి శ్రీరాములు ప్రథమ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, వ్యవసాయ రంగం సంక్షోభాల్లో కూరుకుపోతుంటే ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరించడం దారుణమైన చర్యన్నారు. కేరళలో రైతులు పండించే 18 పంటలకు కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోయినప్పటికీ సిపిఎం అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ రైతులకు బాసటగా నిలబడిందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తి చేయాలని సిపిఎం చేపట్టే ఆందోళనలో అందరూ పాల్గొని జయప్రదం చేయడం శ్రీరాములుకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి లక్ష్మి, సర్పంచ్ దువ్వాడ మధుకేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు దువ్వాడ అప్పారావు, పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన అవసరం



నందిగాం : గణితంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి- నందిగాం

విద్యార్థి దశలో గణితంపై అవగాహన పెంచుకొని మెళకువలపై పట్టు సాధిస్తే గణితం సులభం అవుతుందని శాఖా గ్రంథాలయాధికారి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి గణితం అవశ్యకత, ప్రాధాన్యత విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా వేసవిలో ప్రతిఒక్కరూ సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో గత ఎనిమిది రోజుల నుంచి రిసోర్స్ పర్సన్ ద్వారా విన్న విజ్ఞానాన్ని కొంతమంది విద్యార్థులు రిసోర్స్ పర్సన్‌గా మారి విద్యార్థులకు క్లాస్ చెప్పారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వేసవి విజ్ఞాన శిబిరాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయకుడు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రూపావతితో పాటు సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.



లావేరు : బోధిస్తున్న విద్యార్థి

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వేసవి తీవ్రత అధికంగా ఉండడం వల్ల మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు రావద్దని, నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల జంక్షన్‌లో మెడిటేరియన్ స్కూల్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న దృష్ట్యా చిరు వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు, జాగ్రత్తలు పాటించాలన్నారు. కచ్చితంగా తలపై టోపీ ధరించాలని, గొడుగును అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా వైద్యులు చెప్పిన సూచనలను పాటిస్తూ మంచినీటిని ఎక్కువగా తాగాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సుధాకర్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ప్రముఖ వైద్యులు చాపర సుధాకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టి-20 కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ఆయన పాల్గొని క్రీడాకారులకు పలు సూచనలు చేయడంతో పాటు అభినందనలు తెలిపారు. సుమారు 30 రోజులు తమ్మినేని చిరంజీవిరావు మెమోరియల్ ట్రస్ట్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ నిర్వహించడం అభినంద నీయమన్నారు. కళింగపట్నం, వీరఘట్టం జట్ల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్‌లో వీరఘట్టంపై కళింగపట్నం విజయం సాధించింది.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం

ప్రజాశక్తి- టెక్కలి

వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రంలో మంగళవారం వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు ఇన్‌ఛార్జి బాడన నారాయణరావు తెలిపారు. ఉదయం 5:30 నుంచి 7:30 వరకు సాయంత్రం ఐదున్నర నుంచి ఏడు గంటల వరకు ఈ శిక్షణ శిబిరం నిర్వహించ బడునని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే విద్యార్థులు నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

అనాథలకు అన్నదానం

శ్రీకాకుళం: సిక్కోలు ఖ్యాతిని పెంచిన ప్రముఖ నాట్యకారుడు దివంగత కాయల శివకుమార్ 5వ వర్థంతిని పురస్కరించుకుని నగరంలోని మథర్ థెరిసా హోంలో ఉన్న అనాథలకు ఆయన సతీమణి కాయల పార్వతి, పిల్లలు అరుణ్ తేజ, శ్రీహస్వికలు అన్నదానం చేశారు. అలాగే నగరంలోని టౌన్‌హాల్ రోడ్డులో మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జెసిఐ పూర్వ అధ్యక్షులు పి.మణిశర్మ, పద్మనాభరాజు, కె.ఆణిశ్రీ, కె.అఖిల, టిడిపి మైనార్టీసెల్ నిజాముద్దీన్, ఫిరోజ్ ఖాన్, అజ్జు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

టెక్కలి: విద్యార్థులు చదువుతున్న సమయంలోనే చదువుతో పాటు శాస్త్రీయ దృక్పథం అలవడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు కోరారు. స్థానిక ప్రజా చైతన్య కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మెళియాపుట్టి మండల విద్యాశాఖ అధికారి, పూర్వపు జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి పద్మనాభం ప్రదర్శించిన వివిధ రకాల ప్రదర్శనలు విద్యార్థులను అలరించాయి. కార్యక్రమంలో కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు దూసి ఆంధ్ర స్టాలిన్, చిలుకు కృష్ణారావు, ఉత్తర కవాటం గణపతి, మూల తాతయ్య, మోహన్ గౌడ్, ఆర్.వి.రమణ మూర్తి, అనిశెట్టి చిట్టన్న, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం

ప్రజాశక్తి- కవిటి

చిన్న వయసులోనే భారత నావికాదళంలో లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందిన కవిటి మండలం గొండ్యాలపుట్టుగకు చెందిన దుద్ది వేణు నేటి యువతకు ఆదర్శమని శ్రీశయన చైతన్య దీపిక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మోహనరావు, డి.వీర్రాజు అన్నారు. పదోన్నతి పొందిన అనంతరం స్వగ్రామానికి వచ్చిన వేణును మంగళవారం శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పదోన్నతి పొందిన వేణు అటు మన ప్రాంతానికే కాకుండా ఇటు తమ సామాజిక తరగతికి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. వేణు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పి.బాలకృష్ణ, బి.జానకిరావు, కోళ్ల తులసీరావు, డి.లోకనాథం, టి.గంగారావు, డి.రాము, జి.ప్రకాష్, పి.నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న శ్రీశయన సంఘ సభ్యులు



కుటుంమిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మహిళల స్వయం ఉపాధే లక్ష్యం

కొత్తూరు: మహిళల స్వయం ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక ఎదుగుదలే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్వయం ఉపాధి కల్పించేందుకు ఇది గొప్ప అవకాశం అన్నారు. మూడు నెలలు శిక్షణ పొందిన తర్వాత ఉచితంగా కుట్టుమిషన్లు అందించ బడతాయన్నారు. శిక్షణ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. మహిళలకు సుమారు రూ.24 వేలు విలువైన కుట్టుమిషన్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీరజ, ఎఒ రాంబాబు, కూటమి నాయకులు అగతముడి అరుణ్ కుమార్, మాతల గాంధీ, అగతముడి మాధవరావు, నూకరాజు, తిరుపతి రావు, చోడవరపు రాము, దశరథ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి- పలాస

అర్బన్ హౌసింగ్‌లో గల పెండింగ్ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సిబ్బందిని సూచించారు. జిల్లా కలెక్టర్ పురపాలక సంఘంలో రామకృష్ణాపురం లేఅవుట్‌లో పెండింగ్ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించడంతో మంగళవారం కమిషనర్ నడిపేన రామారావు పురపాలక సంఘ కార్యాలయంలో ఎమినిటీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. రామకృష్ణాపురం లేఅవుట్‌లో 1963 ఇళ్లకు 1407 ఇళ్లు పూర్తికాగా మిగిలిన 556 పెండింగ్ ఇళ్లకు కేవలం 91 ఇళ్లుమాత్రమే పూర్తిగా పూర్తి చేయబడి ఉన్నందున మిగిలి ఉన్న 465 ఇండ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా ఆదేశించారు. సిబ్బంది అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. సమావేశంలో ఎమినిటీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

భూసారం పెంపొందించుటకు, కలుపు నివారణకు వేసవిలో తొలకరి జల్లులకు పచ్చిరొట్ట విత్తనాలను వేసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి. తిరుమలరావు అన్నారు. మండలం ఎత్తురాళ్లపాడులో ఖరీఫ్‌కు సంబంధించి రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను మండల ఎఒ ఎస్. గోవిందరావుతో కలిసి పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, 50 శాతం రాయితీపై 10 కేజీల జీలుగ బస్తా రూ.615, కట్టె జనుము 10 కేజీల బస్తా రూ.545, జీలుగ 4 కేజీలు, కట్టెజనుము 4 కేజీలు, పిల్లి పెసర రెండు కేజీలు కలిపి 10 కేజీల బస్తా రూ.648కు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విఎఎ జి.గురునాధ్ తదితరులు పాల్గొన్నారు.



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రతి మహిళ ప్రగతి సాధించాలి

ఇచ్ఛాపురం: ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని సెర్ప్ ఎపిఎం ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండల మహిళా సమైక్య భవనంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘం గతంలో తయారు చేసుకున్న వార్షిక రుణ ప్రణాళిక జీవనోపాధి రుణ ప్రణాళిక ఆధారంగా ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న ప్రతి రుణం ద్వారా తప్పనిసరిగా ఆస్తులు కొనుగోలు చేసుకునే విధంగా, ప్రణాళికలో ఏదైతే చూపించారో ఆ ఆదాయ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి ఖర్చు చేసి ప్రతి మహిళ ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నారు. హోం కంపోస్ట్, కిచెన్ గార్డెన్, ఐసిడిఎస్ కార్యక్రమాలు పర్యవేక్షణ, తదితర విషయాలు అన్ని సంఘాలలో సక్రమంగా సమావేశాలు నిర్వహించు కోవాలని సూచించారు. సమావేశంలో అధ్యక్షులు ఎల్.సుశీల, కార్యవర్గ సభ్యులు డి.పార్వతి, 36 గ్రామ సంఘాల లీడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?

ప్రజాశక్తి- పొందూరు

చెత్తాచెదారాలు, కొబ్బరి బొండాలు పెద్దఎత్తున పేరుకుపోయి అధ్వానంగా కనిపిస్తున్న ఈ దృశ్యం మండలంలోని రాపాక కూడలిలోనిది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వినియోగించిన కొబ్బరిబొండాలు, చెత్తాచెదారాలతో పాటు చేపల వ్యర్థాలను పడేస్తుండడంతో దుర్వాసనతో పాటు దోమలతో ఇబ్బంది తలెత్తి రోగాల బారిన పడుతున్నామంటూ పరిసర వాసులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో వినియోగించిన కొబ్బరి బొండాల్లో వర్షపునీరు నిల్వ ఉంటుందని, ఆ నిల్వ నీటిలోని దోమలు కుడితే డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరచాలని పరిసర వాసులు కోరుతున్నారు.



రాపాక కూడలిలో చెత్తాచెదారాలు, కొబ్బరిబొండాలు



మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు